వైఎస్ఆర్
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
శనివారం 27 జూన్ 2026

## ఎమ్మెల్యేచే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



కలికిరి, జూన్ 26, ప్రభాతవార్త: పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో నియోజకవర్గంలోని పలువురు బాధితులకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకోవాలన్నదే సీఎం నారా చంద్రబాబునాయుడు ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా 23 మంది బాధితులకు రూ.17.25లక్షలు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు కె.వి.పల్లి మండలం తెదేపా సీనియర్ నాయకురాలు గీతమ్మ, కలికిరి మండలం టీడీపీ మైనార్టీ అధ్యక్షులు మున్వర్ అలీ, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షులు సుబ్రమణ్యం, గుర్రంకొండ టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## తగ్గిన టమోటా ధరలు- ఆందోళనలో రైతులు

### నష్టాల బాటలో టమెటా రైతాంగం



మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త : గత పది రోజులుగా టమోటా ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లక్షలాది రుపాయలు పెట్టి సాగు చేసిన టమోటా రైతాంగం నష్టాల ఊభిలో ఉంటున్నారు. గిట్టుబాటుధర లేకపోవడంతో రైతులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. మార్కెట్‌కు టమోటాలు ఊహించని విధంగా వస్తుండడం, బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ లేకపోవడం వల్లే ధరలు తగ్గుముఖం పట్టాయంటూ వ్యాపారస్తులు చెబుతున్నారు. శుక్రవారం మార్కెట్‌యార్డులో పదికేజీల టమోటా బాక్స్ మొదటిరకం రూ.160నుంచి 180ల వరకు ధరలు పలికాయి. 1486మెట్రిక్ టన్నులు టమోటాలు మార్కెట్‌కు వచ్చాయి. సాధారణంగా గతంలో టమోటాలు 500నుంచి 600ల మెట్రిక్ టన్నులు టమోటాలు మార్కెట్‌కు వచ్చేవి. అలాంటిది ఎక్కువ టమోటాలు వస్తుండడం వల్ల ధరలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎకరా టమోటా పంటను సాగు చేసేందుకు రూ.2నుంచి 3లక్షల వరకు ఖర్చు అవుతుంది. అలాంటిది ధరలు లేకపోవడం వల్ల రైతాంగం నష్టాల ఊభిలో ..మిగతా 2వ పేజీలో

## రోడ్డు ప్రమాదంలో

# కబళించిన మృత్యువు





ప్రమాదానికి గురైన వాహనాలు ఆటో, కారు

### ముగ్గురు మృతి ఆరుగురికి గాయాలు

### ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి దిగ్భ్రాంతి







ఆటో డ్రైవర్ ముబారక్ (పాత చిత్రం), మృతి చెందిన మొహరీన్ (పాత చిత్రం), మహమ్మద్ పాత చిత్రం



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు , జూన్ 26 ప్రభాతవార్త: అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఆరుగురు తీవ్రంగా గాయపడిన ఈ సంఘటన అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలో శుక్రవారం వేకువ జామున చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు పీలేరు మండలం రేగళ్ల కప్పాకు చెందిన మెహరూన్ (75) తన కోడలు ఇర్ఫానా పుట్టిన ఊరైన కలికిరి మండలం టి.చంద్రావారిపల్లె పంచాయతీ దూదేకుల పల్లెలో ఆమె తల్లిని చూసి అలాగే పీర్ల పండగ చూసి వస్తామని గురువారం రాత్రి ఆటోలో వెళ్లారు. అక్కడ పీర్ల ఊరిగింపు సంబరాలు ముగించుకుని శుక్రవారం వేకువజామున ఆటోలో తిరిగి స్వగ్రామం రేగళ్లకు బయలుదేరారు. పీలేరు మండలం రాణా వడ్డిపల్లె మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో మెహరూనీతో పాటు మనవడు, ఆటో డ్రైవరు ముబారక్ (55) సంఘటనా స్థలంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో ఇర్ఫానా, ఆమె పెద్ద కుమారుడు మొహ్మద్ వా హిద్(19), రెండవ కుమారుడు మొహ్మద్ (18), మొహరూనీ కుమార్తె హుస్సేనీ కుమారులైన మొహ్మద్ అజ్మల్, మొహ్మద్ ఆసీఫ్ పీలేరులో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. మార్గ మధ్యలో మొహ్మద్ మృతి చెందాడు సొరకాయలపేటకు చెందిన సుహాన్, సొహైల్ అనే యువకులు ఆటో ఎక్కి పీలేరుకు వస్తూ ఈ ప్రమాద బారిన పడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వైఎస్ఆర్ కడప జిల్లా కమలంవారిపల్లెకు చెందిన వెంకట్రమణ తీవ్రంగా గాయపడగా, ఆయన భార్య ప్రశాంతి, ఆమె 9 నెలల కుసుమ ప్రియ, మరో మహిళ సుబ్బలక్ష్మి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటేశ్వర్లు వివరించారు.

#### క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే

పీలేరు మండలం రాణా వడ్డిపల్లి సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం అత్యంత బాధాకరమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పీలేరు మండలం రేగల్లు గ్రామానికి చెందిన 8 మంది మొహరం పండుగ చూసేందుకు కలికిరి మండలం దూరేకులవారి పల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా రాణా వడ్డిపల్లి వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. శుక్రవారం ఉదయం పీలేరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న ఆయన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం చాలా బాధాకరం. వారి ఆత్మకు శాంతి చేకూరాలి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది. తీవ్రంగా గాయపడిన ఐదుగురు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ ముబారక్ 55 మెహరున్ బి (75) , మహమ్మద్ (19) ముగ్గురు మృతి చెందగా, ఇర్ఫాని, ఆసిఫ్, వాహీద్, అఫ్జల్, సోహెబ్ ఐదు మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

#### రోడ్డు ప్రమాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

పీలేరు రాయచోటి జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం దురదృష్టకరమని అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తరచూ జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో ప్రయాణికులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేసుకున్నారు .

## ప్రతి ఒక్క ఓటరు బిఎల్ఓలకు

# సహకరించండి

### ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు ఆర్డిఓ శ్రీనివాస్



రాయచోటి, జూన్ 26, ప్రభాతవార్త : అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు బిఎల్ఓలకు సహకరించి వారికి సమాచారం ఇవ్వాలని అన్నమయ్య జిల్లా రాయచోటి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాస్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మరియు ముఖ్య ఎన్నికల అధికారి ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు 01.07.2026 అర్హత తేదీగా ఫోటో ఎలక్ట్రో రల్ రోల్స్ ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ 2026 కార్యక్రమం 128 రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరుగుచున్నది కావున ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ) ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎనుమి రేషన్ ఫామ్స్ పంపిణీ చేయుదురు భర్తీ చేసిన ఫారాలను సేకరించడం మరియు వాటిని డిజిటైజేషన్ చేయడం జరుగుతుందన్నారు ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటర్ జాబితాలో సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక క్యాంపెయిన్ 2706 2026 మరియు28062026 తేదీలలో ఉంటుందన్నారు. ఎస్ఐఆర్ 2026 కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయుటకు 27.06.2026 శనివారం మరియు28.06.2026 ఆదివారం128 రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గం అంతట ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించ బడుతుందన్నారు ఈ రెండు రోజులలో బి ఎల్వోలు ప్రత్యేకంగా ఇంటింటికి వెళ్లి ఈ ఎఫ్, పంపిణీ సేకరణ మరియు డిజిటైజేషన్ డిజిటైజేషన్ పనులను పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటారన్నారు. కావున రాజకీయ పార్టీల వారు బూత్ లెవెల్ ఏజెంట్స్ సహకారంతో బిఎల్వోలు సమన్వయంగా పనిచేసే 100 ఈఫ్ పంపిణీ 100 డిజిటైజేషన్ మరియు 100 మ్యాపింగ్ పూర్తి చేయుటకు ప్రత్యేక దృష్టి సారించ బడతారన్నారు. కావున బిఎల్వోలు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు వారికి పూర్తి సమాచారం ఇచ్చి తమ కుటుంబంలోని ఓటర్ల వివరాలు సరిచేసుకోవలసినదిగా కోరడమైనదని ఆయన తెలిపారు. ఎస్ఐఆర్2026 ముఖ్య ..మిగతా 2వ పేజీలో

## విద్యాలయాలు వ్యాపార

# కేంద్రాలుగా మారాయా..?

### ఫీజుల దోపిడీపై తల్లిదండ్రుల ఆగ్రహం

మైదుకూరు,జూన్ 26, ప్రభాతవార్త: మైదుకూరు పట్టణ ప్రైవేట్ పాఠశాలలో చదువు చెప్పాల్సిన విద్యాలయాలు కాస్తా లాభాల వేటలో వ్యాపార సంస్థలుగా మారాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. విద్యా సంవత్సరం మొదలవడంతోనే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల పుస్తకాలు, ఫీజుల పేరుతో తల్లిదండ్రుల జేబులకు చిల్లు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది.

**విద్య కాదు వ్యాపారం:**

ఇష్టారాజ్యంగా ఫీజులు: ప్రభుత్వ నిబంధనలు, ఫీజుల నియంత్రణ కమిటీ ఆదేశాలు గాలికొదిలేసి యాజమాన్యాలు నచ్చిన రేట్లు వసూలు చేస్తున్నాయి. ట్యూషన్ ఫీజు, టర్మ్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్మార్ట్ క్లాస్ ఫీజు అంటూ రకరకాల పేర్లతో దోపిడీ సాగుతోంది. పుస్తకాల దందా: స్కూల్ యాజమాన్యం దగ్గర లేదా వారు చెప్పిన షాపుల్లోనే పుస్తకాలు, యూనిఫాం కొనాలనే నిబంధన విధిస్తున్నారు. మార్కెట్‌లో రూ.2,000కు దొరికే పుస్తకాల సెట్‌ను స్కూల్‌లో రూ.5,000కు అమ్ముతున్నారు. కమీషన్ల కోసమే ఈ దందా అని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. బస్సు ఫీజుల బాదుడు: విద్యార్థుల ప్రయాణం మీద అని యాజమాన్యం ఫీజు అని సంబోధిస్తూ బస్సు ఫీజులను ఏటా 2030 పెంచేస్తున్నారు. 01 నుంచి 15 కి.మీ. దూరానికి కూడా రూ.5,000 నుంచి రూ.25,000 వరకు వసూలు చేస్తున్నారు. ..మిగతా 2వ పేజీలో

## విడుదల అయిన వెంటనే

# రియాజ్‌ను మళ్ళీ అరెస్ట్

కడప కార్పొరేషన్, జూన్ 26, ప్రభాతవార్త: అల్మాస్ పేట ఘటనలో రియాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం కడప కేంద్ర కారాగారం నుంచి రియాజ్‌ను బెయిల్ పై విడుదల చేశారు. అయితే విడుదల అయిన మరుక్షణమే టూ టౌన్ పోలీసులు మళ్లీ అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర కారాగారం వద్ద భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. జైలు నుండి బయటకు రాగానే రియాజ్‌ను బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారని రియాజ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అల్మాస్ పేట ఘటనకు సంబంధం లేకపోయినా గతంలో గంజాయి కేసులో అరెస్ట్ చేశారని రియాజ్ కుటుంబం కుటుంబం ఆరోపించింది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారాలతో రియాజ్ హైకోర్టులో హేబియస్ కార్పస్ పిటిషన్ వేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. కొడుకుపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, రెండు నెలలుగా జైల్లో ఉంచారన్న రియాజ్ తల్లి వాపోయింది. ..మిగతా 2వ పేజీలో

## ఎన్‌జీవో కాలనీలో

# రోడ్లు ఆక్రమణ



### గతంలో నిర్మాణం చేపట్టిన వెంటనే తొలగించిన అధికారులు
### నేడు యదేచ్ఛగా రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు
### పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

బద్వేలు, జూన్ 26, ప్రభాతవార్త: బద్వేలులో ప్రభుత్వ స్థలాలు కనపడితే ఏ విధంగా కబ్జా చేయాలనేదానిపై దృష్టిపెట్టి పథకం ప్రకారం స్థలాలన్ని ఆక్రమిస్తూ పోతుంటే అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. పట్టణానికి సిటీలా కనపడే ఎన్‌జీవో కాలనీలో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.ఒక తెలుగుదేశం నాయకుడు మడకలవారిపల్లె సర్వే నెం.953,955లకు మధ్యలో ఉన్న రహదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు గాని, మున్సిపల్ అధికారులు గానిపట్టించుకోవడం లేదు..మున్సిపాలిటీకీ కూతవేటు దూరంలో ఈ ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ అధికారులు చూస్తున్నారు తప్ప వాటిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. గత కమిషనర్ సర్వేనెం.955లో రోడ్డుకు అడ్డంగా నిర్మాణం చేపట్టిన వెంటనే వాటిని తొలగించి ఇక్కడ ఏ నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరించారు. అయితే కమిషనర్ మారిన వెంటనే కొత్త కమిషనర్ రావడంతో నిర్మాణాలు వేగంగా చేపట్టి రోడ్డును కనపడకుండా చేశారు. లక్షల రూపాయల విలువైన ఇలాంటి రహదారులు ఆక్రమణకు గురైతే భవిష్యత్తులో రోడ్లు ఈ ప్రాంతంలో కనపడవు. అంతేకాకుండా ఎన్‌జీవో కాలనీలో రహదారులంతా 40 అడుగులు, 60 అడుగులు వెడల్పులో ఉండడం వలన ప్రతి ఒక్కరూ ఏదోవిధంగా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మడకలవారిపల్లె వీఆర్వో ఎలాంటి చర్యలు తీసుకోకపోగా నిర్మాణాలు చేపట్టే వారితో ఆక్రమించే వారితో చేతులు కలిపి చేశారనే సమాచారం వినిపిస్తుంది. రోడ్లకు అడ్డంగా నిర్మాణాలు చేపడుతుంటే కాపాడాల్సిన అధికారులే పట్టించుకోకపోతే ఎవరికి చెప్పాలని అక్కడి ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాలన్ని కబ్జాకు గురికావడమే కాకుండా ఒక సెంటు స్థలం కనపడినా మన కబ్జాదారులకు రోడ్డు కనపడితే ఎప్పుడెప్పుడు నిర్మాణం చేపట్టాలనే ఉత్సాహం కనపడే ఈ నాయకులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. రోడ్ల ఆక్రమణకు గురైతే భవిష్యత్తులో ఆ చుట్టూ ఉన్న ఇండ్లకు వెళ్లే ప్రజలకు వెళ్లే రహదారి కనపడకపోతే ఎటు వెళ్లాలి. ఇప్పుడు మాత్రం బాగానే ఉన్నప్పటికీ తర్వాత రోజులలో రోడ్లను పూడ్చకపోతే వాహనాలు వెళ్లేందుకు కూడా స్థలం లేని పరిస్థితి ఏర్పడుతుంది. పేదవాడు ఒక సెంటు గూడు కోసం ఆక్రమించుకుని నిర్మించకుంటే పరుగులు పెట్టే రెవెన్యూ సిబ్బంది ఇంత రోడ్డు ఆక్రమణ జరిగితే కనపడలేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# పసిమొగ్గపై పైశాచికం

### నాలుగేళ్ల బాలికను నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య
### 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
### పక్కింటి మహిళే స్వాతినే నిందితురాలిగా గుర్తింపు
### సీసీ కెమెరాలు, డాగ్ స్క్వాడ్ ఆధారాలతో దర్యాప్తు ముమ్మరం చేసిన డీఎస్పీ మురళి నాయక్
### న్యాయం కోసం రోడ్డెక్కిన బాధిత కుటుంబం
### కఠినంగా శిక్షించాలని బాధితుల డిమాండ్



నిరసన చేస్తున్న బాధితులు

పులివెందుల జూన్ 26 ప్రభాతవార్త : పసిమొగ్గలాంటి నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలను పొట్టన పెట్టుకున్న హృదయ విదారక ఘటన పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం లో చోటుచేసుకుంది. లోపట్నూతల గ్రామంలో నాలుగేళ్ల బాలిక నిత్వికను నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య చేసిన ఘటన గ్రామాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటన జరిగిన 24 గంటలు కూడా పూర్తికాకముందే పోలీసులు కేసును ఛేదించి నిందితురాలిని గుర్తించారు. గ్రామానికి చెందిన సృజన శ్రీ, రామాచారి దంపతుల కుమార్తె నిత్విక (4) గురువారం అనుమానాస్పద స్థితిలో నీళ్ల డ్రమ్‌లో మృతి చెంది కనిపించింది. చిన్నారి మృతిపై తల్లిదండ్రులు, గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

**రాత్రివేళ రోడ్డుపై ధర్నా.. న్యాయం కోసం ఆవేదన**

చిన్నారిని హత్య చేసి నీటిలో పడవేశారని ఆరోపిస్తూ గురువారం రాత్రి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు పులివెందుల-పార్నపల్లె రింగ్ రోడ్డుపై ధర్నాకు దిగారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న డీఎస్పీ మురళి నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కేసును త్వరితగతిన ఛేదించి ..మిగతా 2వ పేజీలో

## యువత ఉజ్వల భవిష్యత్తుకు

# మాదకద్రవ్యాలే పెద్ద శత్రువు

### మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పిలుపు




మదనపల్లె క్రైం, జూన్ 26 ప్రభాతవార్త. మాదకద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తుందని, విద్యార్థులు, యువత వీటికి దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకో వాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మదనపల్లె పోలీసు ప్రధాన కార్యాలయంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల తలెత్తే తీవ్రమైన శారీరక, మానసిక, సామాజిక పరిణామాలపై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. యువతను చైతన్యపరుస్తూ ఆయన చెప్పిన నినాదాలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గంజాయి వద్దు బ్రో.. జీవితాలు ముద్దు, మత్తు జీవితాన్ని చేస్తుంది చిత్తు అంటూ ఎస్పీ ఇచ్చిన నినాదాలతో విద్యార్థుల్లో ఉత్సహాన్ని నింపారు. క్షణికానందం ..మిగతా 2వ పేజీలో

## ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో

# అందించడం అధికారుల బాధ్యత

### టిడిపి ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



ప్రజల సమస్యలు వింటున్న జగన్మోహన్ రాజు

రాజంపేట, జూన్ 26 ప్రభాతవార్త ప్రభుత్వ సేవలు ప్రజలకు సక్రమంగా అందించడం అధికారుల బాధ్యత అని అప్పుడే ప్రజలు కార్యాలయాలకు, ప్రజా దర్బార్లకు వచ్చే పరిస్థితి లేకుండా పోతుందని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. నిర్దేశించిన సేవలను ప్రజలకు నిర్దిష్ట సమయంలో అందించాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉందన్నారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని,వాటికి వేగవంతమైన పరిష్కారం అందించాలనే సంకల్పంతోనే ప్రజా దర్బార్ కార్యక్రమం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద తరలివచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత సామాజిక, ఆర్థిక సమస్యలకు సంబంధించిన అర్జీలను వినతి పత్రాలను చమర్తికి అందజేశారు. ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడిన చమర్తి ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించి,సమస్యల వివరాలను అడిగితెలుసుకున్నారు. ప్రజాదర్బార్ ప్రజలు రెవెన్యూ సమస్యలు,భూ వివాదాలు,పెన్షన్స్ మంజూరు,గృహాల మంజూరు, సంక్షేమ పథకాల అమలు తమకు అందడం లేదని జగన్ మోహన్ రాజు దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ప్రజల ప్రతి ఒక్క సమస్యను ఓపికగా విని బాధితులకు ధైర్యం చెబుతూ సమస్యల పరిష్కారానికి..మిగతా 2వ పేజీలో

# సర్ ప్రక్రియపై అపోహలు వద్దు

### సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి



**మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :** ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ (సర్)పై ప్రజలు ఎలాంటి అపోహాలు చెందవద్దంటూ సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో జూన్ 15నుంచి సర్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. బిఎల్‌ఓలు ప్రతి ఇంటికి వచ్చి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారన్నారు. ఓటర్లు తమ వద్ద ఉన్న ఆధారాలతో ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి బిఎల్‌ఓలకు అందజేయాలన్నారు. బిఎల్‌ఏలు, బిఎల్‌ఓలు సంయుక్తంగా సర్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా సర్ కార్యక్రమానికి సహకరించాలన్నారు. ఓటర్లను తొలగిస్తారంటూ సోషల్‌మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మకండి అంటూ తెలిపారు. 2002 ఓటర్ల జాబితా ప్రకారం ఎన్యుమరేషన్ ఫారాలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈసిఐ యాప్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ ఫారాలను భర్తీ చేయవచ్చునన్నారు. ఓటర్లకు సర్ కార్యక్రమంపై ఎలాంటి అనుమానాలున్న సంబంధిత బిఎల్‌ఓలను సంప్రదించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సర్ కార్యక్రమం ద్వారా జాబితాలో ఓటర్‌ను పొందుపరచడం జరుగుతుందన్నారు. ప్రజలు సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# గంగాభవానికి రాహుకాల అభిషేకం



**చౌడేపల్లి, జూన్ 26, ప్రభాతవార్త:** శక్తి స్వరూపిణి అయిన బోయకొండ గంగమ్మ అమ్మవారికి రాహుకాల అభిషేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు వేద పండితులు అమ్మవారికి ఉదయాన్నే అభిషేకము అలంకరణ కావించారు అనంతరం రాహుకాల సమయంలో దంపతుల సమక్షం నందు వివిధ జలాలతో అభిషేకించి విశిష్టత రీతిలో అలంకరణ నిర్వహించారు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం నేతృత్వంలోని అధికారిక అర్చక సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**భక్తుల నమ్మకం.. లోక సుభిక్షం**

హిందూ సంప్రదాయంలో రాహుకాల పూజలకు ప్రత్యేక విశిష్టత ఉంది. ముఖ్యంగా బోయకొండ గంగమ్మ చెంత జరిగే రాహుకాల అభిషేకంలో పాల్గొంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల గాఢ నమ్మకం. ఈ పవిత్ర అభిషేకంలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత కళ్యాణ కట్ట వద్ద ఆలయం తరఫున భక్తులకు భోజన వసతి కల్పించారు పలమనేరుకు చెందిన నవీన్ ఆయన మిత్రబృందం అన్నదాన శిబిరానికి కూరగాయలు విరాళంగా అందించారు.

# ఆందోళనలో రైతులు

మొదటి పేజీ తరువాయి

కూరుకుపోతున్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి నియోజకవర్గాల్లో టమోటా పంటను రైతులు ఏడాది పొడవునా జీవనాధార పంటగా సాగు చేస్తారు. జిల్లాలో సుమారు 20 వేల హెక్టార్లలో టమోటా సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు టమోటాను రబీ, ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. టమోటా వ్యాపారా లావాదేవీలకు మదనపల్లె మార్కెట్ యార్డు రాష్ట్రంలోనే పేరు పొందింది. తగ్గిన ధరలతో రైతులకు సాగు చేసిన పెట్టుబడి కూడా చేతికి అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా ఎకరాలో డ్రిప్ ద్వారా, ఎరువులు, మేలురకం టమోటా పండించేందుకు రైతులు భారీగా ఖర్చు చేస్తున్నారు. ధరలు లేకపోవడం వల్ల పెట్టుబడి కూడా చేతికి రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. రైతులకు గిట్టుబాట ధర కల్పించడంలో ప్రభుత్వం కూడా విఫలం చెందిందంటూ రైతులు బహిరంగంగా చెబుతున్నారు. గతంలో ఇదే మదనపల్లె మార్కెట్‌యార్డులో కిలో టమోటా రూ.50నుంచి 100ల వరకు ధరలు పలికిన దాఖలాలు ఉన్నాయి. అప్పటి ధరలు నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ధరలు లేనప్పుడు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదంటూ పలువురు ఆవేదన చెందుతున్నారు. మదనపల్లె మార్కెట్‌యార్డు నుంచి తమిళనాడు, ఒడిస్సా, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తారు. వందలాది మంది వ్యాపారులు, వేలాది మంది కూలీలు టమోటా వ్యాపారలావాదేవీలతో జీవనం పొందుతారు. బయట ప్రాంతాల్లో టమోటాకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్లే ధరలు తగ్గాయని వ్యాపారస్తులు చెబుతున్నారు.గిట్టుబాటు ధర లేకపోవడంతో టమోటాలను పొలాల్లోనే రైతులు వదిలివేస్తున్నారు.

# అధికారుల బాధ్యత

మొదటి పేజీ తరువాయి

అవసరమైన చర్యలు చేపడతామని జగన్ హామీ ఇచ్చారు.అదేవిధంగా సమస్యల తీవ్రతను బట్టి కొన్ని అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో అప్పటికప్పుడు మాట్లాడారు.తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలకు వేగంగా పరిష్కారం చూపడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చమర్తి స్పష్టం చేశారు.పెండింగ్ లో ఉన్న అర్జీలను పరిశీలించి త్వరగా తిన పరిష్కరించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిపత్రాన్ని సంబంధిత శాఖలకు పంపించి సమస్యల పరిష్కారం దిశగా నిరంతర పర్యవేక్షణ చేపడతామని జగన్రాజు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి రాజీ ఉండదని ప్రతి సమస్యను బాధ్యతగా తీసుకొని పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యే అవకాశం లభిస్తుందని,సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వెంటనే పరిష్కార మార్గాలు అన్వేషించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నేసుబ్బ నరసయ్య నాయుడు,వైస్ చైర్మన్ చంగల్ రాయుడు,పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు,మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్,ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్,ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ కలి శెట్టి రమేష్,ఒంటిమిట్ట బొబ్బిలి రాయుడు,మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డియ్య నాయుడు, అంజిబాబు ఆచారి, పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నల్లారి



**వాల్మీపురం జూన్ 26 ప్రభాతవార్త:** వాల్మీకిపురం మండలం గండబోయినపల్లికి చెందిన షేక్ అమీర్ భాష (32) గత నాలుగు నెలల క్రితం ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదంలో కాలికి బలమైన గాయం కాగా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుం టున్న వ్యక్తికి మనసున్న మారాజు నల్లారి బ్రదర్స్ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సిఫారసు మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా శుక్రవారం సాయంత్రం స్థానిక నాయకులు పులి సత్యనారాయణ రెడ్డి అమర్నాథ్ రెడ్డి శేషాద్రి రెడ్డి విజ్ఞప్తి మేరకు అమీర్ భాషకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పులి సత్యనారాయణ రెడ్డి, శేషాద్రి రెడ్డి, డీలర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఏది ఏమైనా సమస్యలు చెప్పిన వెంటనే స్పందించే గుణమున్న నల్లారి బ్రదర్స్ అంటే అందరికీ ఎనలేని అభిమానమని అందుకే ఎవరికి ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి అయినాఇంటి తలుపు కొట్టి సమస్య చెప్పుకునే చనువు ఇచ్చిన మా ప్రజా నాయకులు నల్లారి బ్రదర్స్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గండబోయినపల్లికి చెందిన లడ్డు, మహమ్మద్ ముబారక్, గండబోయినపల్లి యూత్ పాల్గొన్నారు.

# అగస్త్యేశ్వరాలయ అక్రమాలపై ఉన్నతస్థాయి దర్యాప్తుకు ఆదేశాలివ్వాలి

### దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల శ్రీనాథ్ రెడ్డి డిమాండ్



**ప్రొద్దుటూరు, జూన్ 26, ప్రభాతవార్త:** ప్రొద్దుటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో చోటుచేసుకున్న ఆభరణాలు, నగదు గల్లంతు ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పుప్పాల శ్రీనాథరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివాలయంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణలో భాగంగా స్థాని కంగా పనిచేసే అధికారులను నియమిస్తే సరియైన విచారణ జరిగి బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోక పోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అవినీతి అక్రమాలపై రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. కావున ఈ అంశంపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిగితేనే బాధ్యులు బయటకు వస్తారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రొద్దుటూరు అర్బన్1 పట్టణాధ్యక్షులు వంకదారి నరేంద్రరావు మాట్లాడుతూ ఆలయంలో జరిగిన అవినీతికి సంబంధించిన ఆధారాలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఇప్పటికే నిరసనలు నిర్వహించి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ ఆస్తులు, ఆభరణాలు, నగదు గల్లంతు వ్యవహారంలో నిజాలు వెలుగులోకి వచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, త్వరలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సి.వి. జయలక్ష్మి మాట్లాడుతూ అగస్త్యేశ్వరాలయంలో వెలుగులోకి వచ్చిన అక్రమాలు మంచుకొండలో చిన్న భాగం మాత్రమేనని, ఆలయాల ఆస్తులు, నగలు, నిధుల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకుడు బాబ్జీ, ధార్మిక సెల్ నాయకుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు హరికృష్ణ, సంజీవ్ గౌడ్, మల్లేష్ యాదవ్, పరమేశ్వరరావు, ఓబీసీ మోర్చా నాయకుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్ ప్రక్రియ నిర్వహించాలి

### డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి

**మదనపల్లి, జూన్ 26: ప్రభాతవార్త** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సర్ నిర్వహణలో భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, సూచనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి, ఉప జిల్లా ఎన్నికల అధికారి చంద్రశేఖర్ రెడ్డి ఎన్నికల నమోదు, సహాయ ఎన్నికల నమోదు అధికారులను ఆదేశించినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బూత్ లెవల్ అధికారుల బిఎల్‌వోలు పనితీరును ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. ఈనెల 27, 28 తేదీలలో బిఎల్‌ఓలు అందరూ స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించి, అందరు బిఎల్వోలు వారి యొక్క పరిధిలో ఉండి సర్ ఏన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయడంతో పాటు డిజిటలైజేషన్ చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో వారికి కేటాయించిన బాధ్యతలను వ్యక్తిగతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అనధికార వ్యక్తులకు పనులు అప్పగించరాదని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల పత్రికలలో ప్రచురితమైన వార్తా కథనాలను కూడా దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ఎన్నికల నమోదు అధికారులు ఈఆర్‌ఓస్ సహాయ ఎన్నికల నమోదు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సర్-2026 కార్యక్రమాలు ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాలు, గడువులకు అనుగుణంగానే నిర్వహించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత పాటిస్తూ ఓటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, సంబంధిత వర్గాలందరితో సమానంగా వ్యవహరించాలని తెలిపారు. ఫిర్యాదులు లేదా అభ్యంతరాలు వచ్చినట్లయితే వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా క్షేత్రస్థాయి తనిఖీలు, సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా నిర్లక్ష్యం లేదా లోపాలు చోటుచేసుకుంటే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రతికూల ప్రచారాలకు అవకాశం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

# కేంద్రాలుగా మారాయా..?

మొదటి పేజీ తరువాయి

**మధ్యతరగతికి భారంగా:**

ఒక మైదుకూరు మండలంలోనే 20 ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 15,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక విద్యార్థికి ఏడాదికి సగటున రూ.50,000 నుంచి రూ.1 లక్ష వరకు ఖర్చు అవుతోంది. ఇద్దరు ముగ్గురు పిల్లలు ఉన్న సాధారణ కుటుంబాలు ఫీజులు కట్టలేక అప్పుల పాలవుతున్నాయి. పిల్లల చదువు కోసం బంగారం తాకట్టు పెట్టడం, అప్పులు చేయడం పరిపాటిగా మారింది.

**అధికారుల నిర్లక్ష్యం:**

ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం కమిటీలు వేసినా అవి కాగితాలకే పరిమితమయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా అధికారులు పాఠశాలల తనిఖీలు చేయకపోవడం, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోకపోవడంతో యాజమాన్యాల ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. "మెమో ఇస్తాం, చర్యలు తీసుకుంటాం" అనే మాటలు తప్ప క్షేత్రస్థాయిలో ఫలితం శూన్యమని తల్లిదండ్రులు వాపోతున్నారు.

**తల్లిదండ్రుల డిమాండ్లు:**

విద్యాలయాల్లో ఆట స్థలాలు, ప్రతి స్కూల్ నందు పిటి ఉపాధ్యాయుడు, పిరియడ్ తప్పనిసరిగా చేస్తూ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి ఆటలో పోటీ తత్వం ఉండేలా ఆడించాలి. ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. ప్రతి స్కూల్ ఫీజుల వివరాలు బహిరంగంగా ప్రదర్శించాలి. పుస్తకాలు, యూనిఫాంపై గుత్తాధిపత్యం రద్దు చేయాలి. విదినిళిగి/దితీళీని పుస్తకాలనే అమలు చేసేలా చూడాలి. పాఠశాలలో రేకుల షెడ్లు కాకుండా భవనాలు నిర్మించి సౌకర్యవంతంగా విద్యార్థులకు మంచి చదువును అందించాలి. జిల్లా స్థాయిలో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ఫిర్యాదులపై 48 గంటల్లో చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి తద్వారా ప్రైవేట్ దోపిడీకి చెక్ పడుతుంది.

**ప్రభుత్వ స్పందన ఏది?:**

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని చెబుతున్నా, ప్రైవేట్ పాఠశాలల అడ్డగోలు దోపిడీపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించలేదు. విద్య వ్యాపారం కాదని, అది సేవ అని ప్రభుత్వం గుర్తించి కఠిన చర్యలు తీసుకోకపోతే పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందాలంటే ముందు ఫీజుల దోపిడీ ఆగాలి. లేదంటే చదువు కేవలం డబ్బున్న వారికే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

# పసిమొగ్గపై పైశాచికం

మొదటి పేజీ తరువాయి

గురువారం రాత్రి నిరసన చేస్తున్న బాధితులు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

**పోలీసుల దర్యాప్తులో కీలక ఆధారాలు**

లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా పక్కింట్లో నివసించే స్వాతిపై అనుమానం బలపడిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆమెపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**కుటుంబాల మధ్య వివాదాల కోణంలో విచారణ**

ఇరు కుటుంబాల మధ్య గత కొంతకాలంగా వివాదాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. గతంలో వాహనాల దహనం వంటి ఘటనలు కూడా జరిగినట్లు పేర్కొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు తహసీల్దార్ వద్ద బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ స్పష్టం చేశారు.

**పులివెందులలో నిరసనలు.. నిందితురాలికి శిక్ష పడాలని డిమాండ్**

శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు పులివెందుల రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద, పూలంగల సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. చిన్నారి విషయంలో జరిగిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితురాలికి కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు. కుటుంబాల మధ్య ఉన్న వివాదాలకు చిన్నారిని బలి చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుదిరాలికి పోలీస్ శాఖ లోనే ఉన్నతాధికారి బంధువు ఉన్నారని కేసు నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం నిరసన చేశారు. దీనితో డీఎస్పీ మురళి నా యక్ బాధితులను కలిసి మాట్లాడుతూ నిందితు రాలు వెనుక ఎవరున్నా చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం, సీసీ కెమెరాల ఆధారాలతో దర్యాప్తు ముందుకు సాగిందని తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి మురళి నాయక్

**మీడియా సమక్షంలోనే బాధితురాలకు ఎఫ్ఐఆర్ అందించిన డి.ఎస్.పి మురళి నాయక్**

పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ మురళి నాయక్ మాట్లాడుతూ చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పాత చట్టం ప్రకారం 302 ఐపీసీ కింద, ప్రస్తుత చట్టం ప్రకారం 46/26 బి ఎన్ ఎస్ 102 / క్లాజ్ 1 ప్రకారం సంబంధిత సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.ఎస్పీ సచేత్ విశ్వనాథ్ సహకారంతో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలను రంగంలోకి దింపి ఆధారాలు సేకరించామని చెప్పారు. సీసీ కెమెరా ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారంగా స్వాతిపై అనుమానం బలప డిందన్నారు.

**కడప రిమ్స్‌కు మృతదేహం తరలింపు**

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు ఫోరెన్సిక్ వైద్యులు అందుబాటులో లేవకపోవడంతో పోస్టుమార్టం కోసం చిన్నారి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. నీటి నమూనాలు, ఇతర ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు పోలీసులు తెలిపారు.చిన్నారి నిత్విక మృతితో లోపట్నూతల గ్రామం విషాదంలో మునిగిపోయింది. వేగంగా స్పందించి కేసును ఛేదించిన పోలీసులపై గ్రామస్థులు విశ్వాసం వ్యక్తం చేస్తూ.. నిందితురాలికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడాలని కోరుతున్నారు.

# స్థానిక ఎన్నికల్లో వైసీపీ జెండా విజయఢంకా మోగించాలి

### పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



**కలికిరి, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించి వైసీపీ జెండా ఎగురవేయాలని పీలేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కలికిరి మండలం వైసీపీ ప్రధాన కార్యదర్శి కంభం ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే చింతలను, అలాగే రాజంపేట ఎంపీ వెంకట మిథున్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో జరుగుతున్న సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటరు నమోదు, పేర్ల సవరణ, మార్పులు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అధికార పార్టీ నాయకులు వైసీపీ నాయకుల ఓటర్లు తొలగించే ప్రయత్నాలలో ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలతో సంప్రదించి తమ ఓటు చేజారకుండా చూసుకోవాలన్నారు. కార్యకర్తలకు తాము అండగా ఉంటామని గ్రామాలలో కూటమి ప్రభుత్వం అరాచకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జరగనున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వైసీపీ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండల వైసీపీ నాయకులు కంభం ద్వారకనాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, లోకనాథరెడ్డి, సహదేవరెడ్డి, చెంగయ్య, విశ్వనాథయ్య, గోపాల్, ఓబయ్య, రెడ్డప్ప, రమేష్, గంగరాజు, మోహన్, వెంకటేష్, మల్లికార్జునరెడ్డి, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

# పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

### రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



**మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త:** రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మదనపల్లెలోని రైతుసంఘం కార్యాలయంలో జిల్లా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగ సమస్యలు అధికంగా ఉన్నాయని రైతులు పండించిన పొగాకు, మిర్చి, పత్తి, జొన్న, వరి, టమోటా తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారన్నారు. ప్రభుత్వం రైతు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, కోల్డు స్టోరేజ్‌లను నిర్మించి రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి రామచంద్ర మాట్లాడుతూ రైతులకు పంట భీమా సౌకర్యం కల్పించాలన్నారు. హంద్రీ-నీవా కాలువ పూర్తి చేసి చెరువులకు అనుసంధానం చేసి నీళ్ళు ఇవ్వాలన్నారు. పాడిపరిశ్రమలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. టమోటా రైతులను తక్షణం ఆదుకొని గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షునిగా మనోహర్‌రెడ్డి, కార్యదర్శులుగా రామచంద్ర సభ్యులను ఎన్నుకొన్నారు.

# బయపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహం చోరి

### పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

**చౌడేపల్లి జూన్ 26 ప్రభాతవార్త** భక్తిశ్రద్ధలతో నిత్య పూజలు అందుకుంటున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆల యంలో అపశృతి చోటుచేసుకుంది కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోని పంచలోహ విగ్రహంతో పాటు జంట దీపాంతరాలను దొంగలించుకున్న సంఘటన చోటుచేసుకుంది గ్రామస్తుల కథనం మేరకు చౌడేపల్లి మండలం 29ఏ చింతమాకుల పల్లి పంచాయతీ బయపల్లిలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఉంది నిత్య పూజ లు అందుకుంటున్న స్వామి వారి ఆలయంలో కాపలాగా ఒక వ్యక్తిని ఉంచారు వ్యవ సాయ పనుల నిమిత్తం కాపలాదారు రెండు రోజులుగా ఆలయానికి రాలేదు ఈ క్రమంలో శుక్రవారం స్వామి వారి పూజ చేయాలని ఆలయ తలుపులు తెరిచి చూడ గా సుమారు రూ 1.50 లక్షల విలువ చేయు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి పంచలోహ విగ్రహము జంట దీపాంతరాలు కనిపించలేదని అర్చకుడు గ్రామస్తులకు తెలియజేశా డు వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు గుర్తుతెలియని దుండగులు ఆలయ తలుపులు పగలగొట్టి లోపల ఉన్న పంచలోహ విగ్రహాలను దొంగలించుకుని వెళ్లినట్లు నిర్ధారిం చుకొని దర్యాప్తు చేస్తున్నారు కాగా యేటా కదిరి పౌర్ణమి రోజున ఉత్సవ పంచలోహ విగ్రహాన్ని దాదాపు ఈ చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో ఊరేగించడం ఆనవాయితీ అయితే ఆలయంలో విగ్రహాన్ని దొంగలించారన్న వార్త దావనంలా వ్యాపించడంతో భక్తులు ఆలయం వద్దకు

## ప్రభుత్వ పాఠశాల మూసివేతపై మాలమహానాడు ఆవేదన



**పీలేరు జూన్ 26 ప్రభాతవార్త:** పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అధికారులు మూసి వేయడంపై మాలమహానాడు రాష్ట్ర కార్య వర్గ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో శాసనసభ్యులు జీ.వి. శ్రీనాధ రెడ్డిచే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. కొత్త పల్లి చుట్టు పక్కల ప్రాంతాల విద్యార్థులకు విద్యానందించి నేడు ఎంతో మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా, మేధావులుగా, తీర్చి దిద్దిన పాఠశాల ఈరోజు కార్పొరేట్, ప్రైవేట్, విద్యా సంస్థలకు దీటుగా పాఠశాల నిర్వహించలేక మూసివేయడం ఎంతో బాధిం చదగ్గ విషయమని దీనిని ఆసరాగా తీసుకోని కొంతమంది బడాబాబులు ఆ పాత శాల గదులను తమ వ్యక్తి గత గోడౌన్లుగా ఉపయోగించుకుంటున్నారని పాఠశాలను అనధికారంగా ఉపయోగిస్తున్నారని పాఠశాల పర్యవేక్షణపై చరవాణి ద్వారా మండల విద్యాశాఖ అధికారులను,యం. పి.డి.ఓ.ను, గ్రామ సచివాలయ సెక్రట రీని వివరణ కోరగా పొంతనలేని సమాదానాలు తెలిపారని దీనిపై జిల్లా ఉన్నతా ధికారులు స్పందించి తగు చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు.

# సహకరించండి

మొదటి పేజీ తరువాయి

షెడ్యూల్: 1)బిఎల్‌ఓల ద్వారా ఇంటింటికి సందర్శనలు 15.06.2026 నుంచి 14.07.2026 వరకు,2) పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ 14.07.2026 లోపు ఉంటుందన్నారు.3) ముసాయిదా వాటర్ జాబితా ప్రచురణ 21.07.2026,(4) క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణ 21.07.2026 నుంచి20.08.2026 వరకు గడువు ఉంటుందన్నారు. (5) నోటీసులు జారీ / క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల పరిష్కారం 21.08.2026 నుంచి 18.09.2026 వరకు గడువు ఉంటుందన్నారు.(6) తుది ఓటరు జాబితా ప్రచురణ 22.09.2026 ఏనుమెరషన్ ఫార్మ్స్ పంపిణీ మండలాల వారీగా నివేదిక క్రింది విధంగా తెలపడమైందన్నారు. లక్కిరెడ్డిపల్లికి ఎం. క్రాంతి కుమార్ 7674950708, రామాపురం మండలం ఎస్. వెంకటేశులు 7674950710, గాలివీడు మండలానికి జేఈ భాగ్యలత 7674950705, చిన్నమండెం మండలానికి నంద్యాల రామాంజనేయులు7674950704, సంబేపల్లి మండలానికి వెంకట సుబ్రహ్మణ్యం రెడ్డి 9959667561, రాయచోటి మండలానికి జనపాటి యామిని 7674950711, రాయచోటి మున్సిపాలిటీ పోకల రమణారెడ్డి9949245670 మీకేమైనా సందేహాలు సహాయం కోసం ఆయా మండలాల వారీగా పైన తెలిపిన మొబైల్ నెంబర్లను సంప్రదించవలసినదిగా కోరడమైనది. కావున ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తమవంతుగా సహకరించాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

## ఏపీఎస్ఏహెచ్పిసి సభ్యుడిగా డాక్టర్ రెడ్డన్న నియామకం



**రాయచోటి జూన్ 26 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ సభ్యుడిగా తనను ప్రభుత్వం నియమించి నట్లు రాయచోటి పట్టణానికి చెందిన కంటి వైద్యుడు జి. రెడ్డన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఏహెచ్పిసి సభ్యుడిగా మూడేళ్ల పాటు కొనసాగనున్నట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వం జనరల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. రెడ్డన్న 40 సంవత్సరాలుగా కంటి వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం సురభి ప్రైమరీ హెల్త్ సెంటర్లో ఆప్తాల్మిక్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా జిల్లాలోని వందలాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకుచెందిన వేలాది మంది కంటి పరీక్షలు, వైద్య సేవలు అందించారు. వ్యక్తిగతం తో పాటు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా, అసిస్టెంట్ గవర్నర్గా పనిచేసి కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలను అందించారు. కాగా రెడ్డన్న ఏపీఎస్ఏహెచ్పిసి రాష్ట్రస్థాయి సభ్య డుగా ఎన్నిక కావడం పట్ల రాయచోటికి చెందిన పలువురు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, సిబ్బందితోపాటు పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

# మాదకద్రవ్యాలే పెద్ద శత్రువు

మొదటి పేజీ తరువాయి

కోసం అలవాటు పడే మత్తు పదార్థాలు, జీవితాంతం తీరని శాపంగా మారుతాయన్నారు. స్నేహితుల ఒత్తిడికి లొంగి భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వేంకటాద్రి, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, సీఐలు సదాశివయ్య, మహమ్మద్ రఫీ, రాజారెడ్డి, పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షేమం అభివృద్ధి కూటమితోనే సాధ్యం

వేంపల్లి జూన్ 26 ప్రభాతవార్త



రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో జరుగుతున్నదని అందుకు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంకే సాధ్యం అని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పీవీయెస్ వి ప్రసాదరావు సూగురు రఘునాథరావు లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో బ్రాహ్మణులకు ఎక్కువ లబ్ధి జరిగిందని ప్రస్తుతం 46000 మంది బ్రాహ్మణులకు 21కోట్ల రూపాయలు ఎన్టీఆర్ భరోసా కింద ప్రతి నెల పొందుతున్నారని ఇది గత ప్రభుత్వంలో కంటే 20000 మంది బ్రాహ్మణులు అదనంగా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అంతే గాక 970 దేవాలయలలో బ్రాహ్మణులకు పాలక మండలిలో అవకాశం కలిగిందన్నారు. ఇంకా 400 దేవాలయలలో పాలక మండలి ఏర్పాటు చేయాల్సి వుందని ఇంకా 400 మంది బ్రాహ్మణులకు అవకాశం కలిగే అవకాశం ఉందని అన్నారు. ఇది గాక దూప దీప నైవేద్యం కింద చిన్న దేవాలయలలో ప్రతి పూజారి కి 7000రూపాయలు బత్యం కింద 3000రూపాయలు దీపారాధన ఖర్చులు కు పొందుతు న్నారని అన్నారు. తల్లికి వందనం పథకం చాలా మంది దూపదీప నైవేద్యం కింద లబ్ధి పొందుతున్న పూజారి పిల్లలకు రావాల్సి ఉందని వారి విషయం పరిశీలనలో ఉందని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమకార్పొరేషన్ బిసి శాఖ నుండి దేవాదాయ శాఖ కిందకు మార్చడంతో బ్రాహ్మణులుకు మేలు జరుగుతుందని చెప్పారు. బ్రాహ్మణులకు ఇంకా సబ్సిడీ రుణాలు మంజూరు చేయవలసి ఉందని కార్పొరేషన్ పాలక మండలి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముద్దనూరు, జూన్ 26 (ప్రభాతవార్త):

మండలంలోని 11 కేవీ బడుగువారిపల్లె విద్యుత్ సరఫరా మార్గంలో మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ సహాయక ఇంజనీరు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ కారణంగా 11 కేవీ బడుగువారిపల్లె విద్యుత్ సరఫరా మార్గం పరిధిలోని పెద్ద దుద్యాల, చిన్న దుద్యాల, బడుగువారిపల్లె గ్రామాల్లో నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని సహాయక ఇంజనీరు శ్రీనివాసులు రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## శివాజి విగ్రహాన్ని మరోచోట ఏర్పాటు చేయాలి

### వాల్మీకి జనసైనిక్ సంఘం నాయకులు



పూజలు చేస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :

శివాజి విగ్రహాన్ని మరో చోట ఏర్పాటు చేయాలని వాల్మీకి జనసైనిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముత్తరాశి హరికృష్ణ తెలిపారు. శుక్రవారం చిత్తూరు బస్టాండ్ వాల్మీకి కూడలి వద్ద వాల్మీకి సంఘాల నాయకులతో కలసి వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ బాహుదా కాలువపై చత్రపతి విగ్రహం ఏర్పాటు చేయడం సభబు కాదని అధికారులు విగ్రహ ఏర్పాటుకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. బాహుదా కాలువలో విగ్రహం నిర్మించడం వల్ల భవిష్యత్తులో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. శివాజి విగ్రహాన్ని అక్కడ నుంచి మరో చోటుకు తరలించాలని మంత్రులకు, జిల్లాకలెక్టర్‌కు విన్నవించడం జరిగిందన్నారు. వాల్మీకి కూడలిగా ప్రసిద్ధి చెందిన ప్రాంతంలో శివాజి విగ్రహం ఏర్పాటు చేయడం సభబు కాదన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు హరిబాబు, విజయమోహన్, చైతన్య, నరసింహా, శంకరా, రాజేష్ పాల్గొన్నారు.

## రెండు పోలియో చుక్కలు తప్పనిసరి

నందలూరు జూన్ 26 ప్రభాతవార్త:

మండలంలోని పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని మండల ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం నాడు మాట్లాడుతూ ఆదివారం 48 పల్స్ పోలియో కేంద్రాలలో 3448 మంది పిల్లలకు వేయడం జరుగుతుంది అని అన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 వరకు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. కావున ప్రజలు ఈ కేంద్రాలలోనే పోలియో చుక్కలు వేయించడం చాలా మంచిది అని అన్నారు. ఆ రోజు ఇళ్లలో లేని పిల్లలకు, ఎక్కువ జ్వరం, విరోచనాలతో బాధ పడుతున్న పిల్లలకు సోమవారం, మంగళవారం ప్రతి ఇంటిని సందర్శించి వేయడం జరుగుతుందని అన్నారు. కావున ప్రజలు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత మండలంగా మార్చాలని కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసా



సిద్ధవటం జూన్ 26 ప్రభాతవార్త

రాజంపేట ఇంచార్జి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో సిద్ధవటం మండలం టక్కోలు గ్రామంలో RTC పాపయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కును పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగముని రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నాగముని రెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. చెక్కు అందుకున్న పాపయ్య కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న ఇలాంటి పథకాలు ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో జల్లి సుబ్బయ్య, శంకర్, పాపయ్య, కృష్ణ,మాజీ వార్డు మెంబెర్ సురేఖ పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కార్యక్రమాలు

### సందేహాల నివృత్తికి అధికారుల ఏర్పాటు ఫారాల పూర్తికి సహకారం

పులివెందుల జూన్ 26 ప్రభాతవార్త :

పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్లకు సంబంధించిన జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కడప వారి ఆదేశాల మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో శనివారం, ఆదివారం ఉదయం 11 గంటల నుంచి ఓటర్ల సందేహాల నివృత్తి, దరఖాస్తుల పూర్తి చేయుటకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఓటర్ల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమాలు పులివెందుల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ సభాభవనం, మండల అభివృద్ధి అధికారి కార్యాలయంతో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించిన సందేహాలు ఉంటే అధికారులు వివరణ అందించడంతో పాటు అవసరమైన దరఖాస్తులను పూర్తి చేసుకునేందుకు సహకరిస్తారని తెలిపారు. ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు తమ పేరు ఉందో లేదో తెలుసుకోవాలని అధికారులు కోరారు.

# సెంచరీ పరిశ్రమ కాలుష్యంపై సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆందోళన

బద్వేలు, జూన్ 26, ప్రభాతవార్త

బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండల పరిధిలోని సెంచరీ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా స్థానిక ప్రజలు, కార్మికులు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, కలుషిత నీరు తాగి జంతువులు, పశువులు మృతి చెందుతున్నాయని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్. చంద్రశేఖర్ ఆరోపించారు. శుక్రవారం బద్వేల్ పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంచరీ పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని, భూములు ఇచ్చిన కుటుంబాలకు ఉద్యోగాలు, భూ కేటాయింపులు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ వాటిని అమలు చేయలేదని ఆయన విమర్శించారు. స్థానికులకు అవకాశాలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల కార్మికులతో పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. పరిశ్రమ జీఎం రమేష్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు ఈ అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మిక శాఖ, పరిశ్రమల భద్రతా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని కాలుష్యంపై సమగ్ర విచారణ జరిపించాలని, భూములు కోల్పోయిన కుటుంబాలు, స్థానిక నిరుద్యోగ యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే స్థానిక ప్రజలు, నిరుద్యోగ యువతతో కలిసి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్య, బి. అనిల్, నియోజకవర్గ కమిటీ సభ్యులు రామరాజు, కే. బాబు, విజయరావు, జయరామరాజు, గంట మహబూబ్ బాషా, చంద్రపాల్, పట్టణ నాయకుడు సలీం తదితరులు పాల్గొన్నారు.




# డిప్యూటీ సీఎంను విమర్శించే స్థాయి వైసిపి నాయకులకు లేదు

కడప కార్పొరేషన్ జూన్ 26 ప్రభాతవార్త:

కులాలకు మతాలకు అతీతంగా పెట్టిన పార్టీ జనసేన.. కులాలను సమానంగా చూసే వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని జనసేన నేతలు తుంగా రమణయ్య, గడేకుల రమణ, పంద్రా రంజిత్ లు అన్నారు. నిజానికి వైసీపీ నాయకులే కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా ఉన్న పంచాయతీరాజ్ వ్యవస్థను సరిచేసి సరిపడ నిధులు ఇచ్చి గాడిన పెట్టి పవన్ కళ్యాణ్ సరి చేశారని కొనియాడారు. శుక్రవారం కడప శంకరాపురం బాలాజీ పేట జనసేన కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక వర్గానికి పరిమితం చేస్తూ వైసీపీ నేతలు మాట్లాడడం భావ్యం కాదన్నారు. కులం, మతం ప్రాంతానికి అతీతంగా అందరినీ సమానంగా పవన్ కళ్యాణ్ చూస్తారన్నారు. గొప్ప జాతీయ భావాలు ఉన్న నాయకుడు పవన్ కళ్యాణ్ అని కీర్తించారు. కులం గురించి మాట్లాడే వైసిపి నాయకులు కాపు సామాజిక వర్గానికి వైసీపీ పార్టీలో రాయలసీమలో ఎన్ని సీట్లు కేటాయించారో చెప్పాలని ప్రశ్నించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో 15 ఏళ్లలో ఒక్క సీట్ అయినా బలిజలకు ఇచ్చారా అని నిలదీశారు. బలిజలకు ఎవరు మేలు చేశారో చర్చకు సిద్ధమా అని కవాలి విసిరారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. అరకొర తాయిలాలతో ఎన్ని రోజులు మభ్యపెడుతారు. కాపు కులానికి 5 రిజర్వేషన్ ఇస్తే దాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్ అమలు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రకులాలకు అనుగుణంగా పాలన సాగుస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అబ్బన్నగారి రాజగోపాల్, తోట సుమన్, మైదుకూరు జనసేన మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోగినేని భరత్ పాల్గొన్నారు.




# మాదకద్రవ్యాలు వద్దు బంగారు భవిష్యత్తు ముద్దు

వేంపల్లె జూన్ 26 ప్రభాతవార్త

డ్రగ్స్ వాడకం చావును కొని తెచ్చుకోవడం తో సమానం అని,అందువల్ల మాదకద్రవ్యాలు,డ్రగ్స్ జోలికి అసలు పోవద్దని ప్రజలకు ప్రత్యేకించి యువతకు రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తులసి రెడ్డి వేంపల్లె లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 1987 డిసెంబర్ 7వ తేదీన ఐక్యరాజ్యసమితి జూన్ 26 ను ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం గా ప్రకటించిందని,1988 నుంచి ప్రపంచవ్యాప్తంగా జూన్ 26 ను ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం గా జరుపుకుంటున్నారన్నారు. మాదకద్రవ్యాల రహిత ప్రపంచాన్ని ఏర్పాటు చేయడమే దీని లక్ష్యం అన్నారు.ఏ దేశ భవిష్యత్తు అయినా ఆ దేశంలో ఉన్న యువతపై ఆధారపడి ఉంటుంది కానీ దురదృష్టవశాత్తు ఇటీవల కాలంలో అటువంటి యువత మాదకద్రవ్యాలకు బానిసలు అవుతుండడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇటీవల కాలంలో హెరాయిన్, మార్ఫిన్, కోడైన్, ఫేంటామిన్, కొకైన్, గంజాయి, చరస్, హషీష్, ఓజీ గంజా, ఎల్ ఎస్ డి ఇలాంటి మాదకద్రవ్యాల వినియోగం పెరగడం దురదృష్టకరం. మాదకద్రవ్యాల వినియోగం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. శారీరక, మానసిక, వ్యక్తిగత, కుటుంబ, సామాజిక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. మానసిక ఆరోగ్యం,శారీరక ఆరోగ్యం క్షీణిస్తాయి. రోగనిరోధకశక్తి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గిపోతాయి. హెపటైటిస్, హెచ్ఐవి, గుండె జబ్బులు, శ్వాసకోశ సంబంధమైన సమస్యలు, కాలేయం జబ్బులు వస్తాయి. నిద్రలేమి, ఆకలి మందగించడం డిప్రెషన్ కు లోను కావడం, హింసా ప్రవృత్తి పెరగడం చదువుకు, ఉద్యోగాలకు దూరం కావడం,కుటుంబాలలో కలహాలు రావడం,దొంగతనాలు హింసకు ప్రేరేపించడం, ఆర్థికంగా దివాలా తీయడం ఇలా అనేక దుష్పరిణామాలు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలుగుతాయని తులసిరెడ్డి అన్నారు. ప్రజల్లో ప్రత్యేకించి యువతలో, విద్యార్థులలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే దుష్పరిణాములపై అవగాహన కల్పించడం చైతన్యం తీసుకురావడం ఎంతో ముఖ్యం.ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా చిత్తశుద్ధితో మాదకద్రవ్యాల సాగు, తయారీ, పంపిణీ, అమ్మకం, వినియోగంపై ఉక్కు పాదం మోపి నిర్మూలించాలని తురిసిరెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్ పాల్గొన్నారు.



## హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు



సిద్ధవటం, జూన్ 26 ప్రభాతవార్త

మండలంలోని మాధవరం1 గ్రామంలో హిందూ సామ్రాజ్య దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ సమేత సీతారాముల ఆలయంలో హిందూ బంధువులు సమావేశమై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వక్త లక్ష్మీ నారాయణ రెడ్డి, ఖండ కార్యవాహక్ పి. వేణుగోపాల రాజు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను, హిందూ సామ్రాజ్య స్థాపనకు ఆయన చేసిన కృషిని వివరించారు. అలాగే హిందూ ధర్మ పరిరక్షణ కోసం పాటుపడిన మహనీయుల సేవలు, వారి త్యాగాలను గుర్తు చేశారు. ప్రస్తుత తరానికి హిందుత్వ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. యువత, ముఖ్యంగా ఆడపిల్లలు పలు సామాజిక అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా మత మార్పిడులకు పాల్పడితే వాటిని అడ్డుకునేందుకు ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవా ప్రముఖ్ గంగాధర్, సుబ్బారెడ్డి, రమణారెడ్డి తదితర స్వయం సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా కొనసాగింది.

## చిన్నారి రితిక హత్య అత్యంత దారుణం

ప్రొద్దుటూరు జూన్ 26 ప్రభాతవార్త

పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం తుమ్మతుల గ్రామంలో జరిగిన చిన్నారి రితిక హత్య అత్యంత దారుణమని బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్ చేసింది ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్ల శ్రీనివాస్ ఆచారి కడప రిమ్స్లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాల చిన్నారి రిత్విక హత్య అత్యంత అమానుషమని కిరాతకంగా కక్షపూరితంగా అన్యాయంగా హత్య చేసిన దుర్మార్గులు కఠినంగా శిక్షించబడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ హత్యోదంతంలో బాధితులకు న్యాయం జరిగే వరకూ విశ్వ బ్రాహ్మణులు బీసీలు ప్రజా సంఘాలు మహిళా సంఘాలు న్యాయ పోరాటం చేయడానికి సహకరించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన బీసీలకు రక్షణ చట్టం వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో శ్రీ విశ్వకర్మ సమైక్య విశ్వ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం ఉత్తరాది రమణాచారి వీరబ్రహ్మయ్య ఆచారి కార్పెంటర్ సంఘం నాయకులు వీర బ్రహ్మచారి జగదీశ్ ఆచారి తదితరులు డిమాండ్ చేశారు.



## నాగరాజును పరామర్శించిన జనసేన నాయకుడు

సుండుపల్లె, జూన్ 26,ప్రభాతవార్త



మండలంలోని రాయచోటి రోడ్డుపై రాచంవాండ్లపల్లి నివాసి గోడిండ్ల ఈశ్వరయ్య పెద్దకుమారుడు భవన నిర్మాణ మేస్త్రీ నాగరాజ ఇటీవల తిరుపతి అమర ఆసుపత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేపించుకున్న తదనంతరం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా మిత్రబృందంతో కలిసి పరామర్శించిన జనసేనపార్టీ సీనియర్ నేత రామ శ్రీనివాస్. ఆయన మాట్లాడుతూ వైద్యాధికారుల సలహా సూచనలను పాటిస్తూ త్వరగా రికవరీ అవ్వడానికి ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మునపటిలానే రోజు వారి తమ కార్యకలాపాలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానికులు గ్రామస్థులు పూజారి ఆంజనేయులు సురేష్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు,

మైదుకూరు,జూన్ 26, ప్రభాతవార్త:



మండలం నంద్యాల రోడ్డు శ్రీనగరం వద్ద పొలం పనులు ముగించుకుని రోడ్డు దాటుతున్న మహిళను ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించడం జరిగింది.రామలక్షుమ్మ (55) అనే మహిళ పొలం పనులు చేసుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి.108 సిబ్బంది సమాచారం అందుకున్న వెంటనే మైదుకూరు 108 అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకుంది. పైలట్ కె. వీరబ్రహ్మం, ఇయంటి పి.రవి క్షతగాత్రురాలికి ప్రథమ చికిత్స అందించి, వెంటనే మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం అవసరమని సూచించడంతో అదే 108 అంబులెన్స్‌లో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ ఘటనపై మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు దాటే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## బోల్టులు ఊడి ఆటో బోల్తా.. గాయాలు

కలసపాడు, జూన్ 26 ప్రభాతవార్త:

కలసపాడు నుండి ఉప్పులూరు రోడ్డులో ఆటో బోల్తా పడింది. తెల్లపాడు హరిజనవాడకు చెందిన ఇమ్మానుయేలు చికెన్ డస్ట్ తరలించి తిరిగి వస్తుండగా టైర్ల బోల్టులు ఊడి ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఎడమ కాలు పూర్తిగా విరిగి తీవ్ర గాయాలయ్యాయి. పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చిన్నరంగాపురంలో దోమలపై యుద్ధం

పులివెందుల జూన్ 26 ప్రభాతవార్త :

వర్షాకాలంలో విజృంభించే మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పులివెందుల అర్బన్ సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న 'శుక్రవారం – పొడి రోజు' కార్యక్రమాన్ని చిన్నరంగాపురం పరిధిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ దోమల వ్యాప్తికి కారణమయ్యే ప్రాంతాలను గుర్తించారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటి తొట్లు, డ్రమ్ములు, ఎయిర్ కూలర్లు, పూల కుండీలను పరిశీలించి దోమల లార్వాల ఉత్పత్తిని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వాలు పెరగకుండా ఉండేందుకు ఆయిల్ బాల్స్‌ను విడుదల చేయడంతో పాటు, లార్వాలు ఉన్న నీటి నిల్వలపై అబేట్ మందును పిచికారీ చేసి దోమల పెరుగుదలను నియంత్రించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శేషగిరి నాయక్, ప్రశాంతి, ఆశా కార్యకర్త నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

## జంట హత్యలకు నిరసనగా దళిత ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

జమ్మలమడుగు, జూన్ 26, ప్రభాతవార్త:

బి.మఠం మండలంలో జరిగిన జంట హత్యలకు నిరసనగా ఈ నెల 29న కడపలో జరిగే దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా.మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన దళిత, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎంఈఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు పిచికె బాబు మాదిగ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో దళితుల ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు అన్యాయం జరిగినప్పుడు కాపాడాల్సిన రాజకీయ, పోలీసు ప్రభుత్వ వ్యవస్థలు ఉన్నత వర్గాలకు కొమ్ము కాస్తున్నాయన్నారు. దీనికి నిదర్శనం బి.మఠం మండలంలో ఇద్దరూ దళిత యువకులు హత్యలు చేయబడి నేటికి 5 నెలలు కావస్తున్నప్పటికి దోషులను ఇంత వరకు అరెస్టు చేయలేదని తెలిపారు. స్వయానా ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జిల్లా ఎస్పీని కలిసి సిట్ ఏర్పాటు లేదా నిజాయితీ కలిగిన ఐపీఎస్ అధికారిని నియమించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దోషులను అరెస్టు చేయకపోతే రాష్ట్ర హోంమంత్రి, డీజీపీ, ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌ను మందకృష్ణ మాదగ నేతృత్వంలో కలుస్తామని చెప్పారు. సమావేశం అనంతరం తాతిరెడ్డి రామలింగారెడ్డి ఆసుపత్రిలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కరెంటు షాక్ తగిలి మరణించిన పాలాజీ సురేష్ కుటుంబ సభ్యులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్నయ్య, పెన్నసర్ల అసోసియేషన్ అధ్యక్షులు దేవదానం, బీఎస్పీ నాయకులు రామాంజనేయులు, దళిత నాయకులు పాలాజీ వెంకట స్వామి, సీపీఐ నాయకులు ప్రసాద్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బిర్రు చెన్నయ్య, ఎస్సీ ఎస్టీమానిటరింగ్ కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు, బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు ఎం.నల్లప్ప, మీడియా ప్రతినిధి పొన్నతోట జయచంద్ర, ఎమ్మార్పీఎస్ నాయకులు రవీంద్ర, హరి, బొంతల ఓబులేసు, నాగన్న, మారెన్న, సుబ్బరాయుడు, నారాయణ, విగ్నేష్, బాలాజీ పాల్గొన్నారు.



## మొహర్రం పండుగను శాంతియుతంగా నిర్వహించాలి

రామసముద్రం జూన్ 26 ప్రభాతవార్త

మొహర్రం పండుగ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుత వాతావరణంలో వేడుకలను నిర్వహించుకోవాలని ఎస్సై హృషి కేశవ రెడ్డి సూచించారు, శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన ఫీర్ల (బాబయ్య )గుడి కమిటీ సభ్యులు సమావేశంలో మత పెద్దలు, హిందూ ముస్లిం లు నిర్వాహకులు ఎస్సై సమావేశం అయ్యారు, ఈ సందర్భంగా శనివారం, ఆదివారం నిర్వహించే మొహర్రం అగ్నిగుండం ప్రవేశం బాబయ్య లు ఫీర్లు ఊరేగింపు వేడుకల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ఊరేగింపు మరియు ఇతర కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు సహకరించాలని కోరారు, ప్రజలందరూ పరస్పర సహకారంతో సామరస్య వాతావరణంలో మొహర్రం బాబయ్య పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు, పండుగ సందర్భంగా భద్రత ఏర్పాట్లు పై సిబ్బందికి తగిన సూచనలు జారీచేశారు, ఈ సమావేశంలో ఎస్సై హృషికేశవ రెడ్డి, పోలీస్ సిబ్బంది మతపెద్దలు తదితరులు హాజరయ్యారు.



## వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు

దువ్వూరు, జూన్ 26, ప్రభాతవార్త:

మండల పరిధిలోని సంజీవరెడ్డి పల్లె గ్రామానికి చెందిన జొన్నవరం శివశంకర్ రెడ్డి(52) అనే వ్యక్తి కనబడకుండా పోవడంతో శుక్రవారం బంధువులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. శివశంకర్ రెడ్డి ఈ నెల 21వ తేదీన ఎర్రబల్లెకు కూలీ పనికి వెళుతున్నానని చెప్పాడని అనంతరం ఇంటికి రాకపోవడంతో సమీప గ్రామాల్లోనూ, బంధువుల ఇళ్ల లోనూ వెతికామని కనిపించకుండా పోవడంతో శివశంకర్ రెడ్డి అన్న ఆంజనేయ రెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# నీటిలో మునిగి చిన్నారి మృతి

పులివెందుల, జూన్ 26, ప్రభాతవార్త :

నియోజకవర్గ పరిధిలోని లింగాల మండలంలో వరుసగా చోటుచేసుకుం టున్న చిన్నారుల విషాద ఘటనలు ప్రజలను కలచివేస్తున్నాయి. గురువారం లోపట్నూతల గ్రామంలో నాలుగేళ్ల బాలిక మృతి ఘటన మరువక ముందే శుక్రవారం చిన్నకూడాల గ్రామంలో మరో చిన్నారి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు.వివరాల్లోకి వెళితే లింగాల మండల పరిధిలోని చిన్నకూడాల గ్రామ హరిజనవాడ సమీపంలో ఉన్న లింగాల కుడి కాలువలో జారిపడి చిన్నకూడాల హరిజనవాడకు చెందిన అరుణ్ కుమార్, నాగమ్మ దంపతుల కుమారుడు అభయ్ (7) మృతి చెందాడు. గురువారం అభయ్ మరో చిన్నారితో కలిసి అంగడికి వెళ్లి తినుబండారాలు కొనుక్కొని తిరిగి ఇంటికి వస్తుండగా హరిజనవాడ సమీపంలోని కాలువ వద్ద ప్రమాదవశాత్తు జారి నీటి ప్రవాహంలో పడిపోయాడు. అభయ్‌తో పాటు వెళ్లిన చిన్నారికి మాట్లాడే సామర్థం లేకపోవడంతో విషయం ఎవరికీ తెలియలేదు.కుటుంబ సభ్యులు బాలుడి ఆచూకీ కోసం వెతుకుతున్న సమయంలో కాలువలో బాలుడి మృతదేహం కనిపించడంతో గ్రామంలో విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.ఒకవైపు చిన్నారుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో.. మరో చిన్నారి నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోవడం మండల ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కాలువల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



## జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మదనపల్లి జూన్ 26 ప్రభాతవార్త

ఏ ఐ వై ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీ నీ ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా ఎస్. విజయన్, కార్యదర్శిగా జక్కల వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఓబులేసు, సహాయ కార్యదర్శి గా జగన్ బాబు, కోశాధికారిగా అంజి లతో పాటు పదిమంది జిల్లా సమితి సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు జక్కల వెంకటేష్, ఏ.విజయ్ లు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి పీ మహేష్ ఏరియా కార్యదర్శి పీ. మురళీ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. వారు మా మీద పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా, యువజనుల పక్షాన, నిరుద్యోగుల సమస్యలపైన, గంజాయి,డ్రగ్స్ లాంటి వాటిపైన నిరంతరం రాజీలేని పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలిపారు.

# సర్ ప్రక్రియలో ప్రతి అర్హునికి న్యాయం జరగాలి : ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి

**మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో(సర్) ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరుకు న్యాయం జరగాలని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను అధిష్టానం సూచనల మేరకు ఆమె సందర్శించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా సర్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాలని పార్టీ నాయకులు, బిఎల్ఏలకు సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా నిలవాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ బిఎల్ఏలు ఇంటింటికి వెళ్ళి ప్రజలకు అవగాహన కల్పిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా పార్టీ అన్ని స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర కార్యదర్శి నరసింహారెడ్డి మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని పార్టీ నియమించిన బిఎల్ఏలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేథావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వియస్.రెడ్డి, నాయకులు చిప్పిలి మల్లికార్జునరెడ్డి, నవాజ్, రామ్మోహన్‌రెడ్డి, ఈశ్వర్‌నాయక్, బయ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

# టిడిపి పాలనలో దళితులపై దహన కాండ



**కడప కార్పొరేషన్ జూన్ 26 ప్రభాతవార్త:**

టిడిపి అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, హత్యలు ఎక్కువైపోయాయని వైసిపి ఎస్సీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి సునీల్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం కడప వైసీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ దళితులపై దాడులు జరుగుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు పట్టించుకోలేదని, ఖండించలేదని దుయ్యబుట్టారు. ఎన్నికలప్పుడు దళితులను ఓటుబ్యాంగా మలుచుకుని అధికారంలోకి వచ్చిన కూటమి దళితులకు ఎటువంటి మేలు చేయలేదన్నారు. దళితులను టార్గెట్ చేసి మరి హింసించి బాధలు పెడుతున్నారని విమర్శించారు. దళితులపై దాడులు కొనసాగిస్తే ప్రజలు టిడిపికి తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా రాష్ట్ర కార్యదర్శిలు కె.బాబు, చిగురుపాటి త్యాగరాజు, మాతంగ సుబ్బరాయుడు, వైకాపా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, వైసిపి జిల్లా వైద్య విభాగం నాయకుడు డా. పెంచలయ్య, ప్రధాన కార్యదర్శి ఏ దాసరి ఏసురత్నం పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ తరుపున విద్యార్థికి నగదు బహుమతి



**జమ్మలమడుగు, జూన్ 26, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గేట్ ప్రవేశ పరీక్షలో యస్. ఉప్పలపాడు గ్రామానికి చెందిన తలారీ మోహన్ ఆలిండియా 89వ ర్యాంకు సాధించిన సందర్భంగారోటరీ బృందం సభ్యులు సమిష్టి సహకారంతో నగదు బహుమతి రూ.20వేలు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎం.మురళీధర్‌రెడ్డి మరియు జోనల్ సెక్రటరీ కుండా భాస్కర్ చేతుల మీదుగా అందించినట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి, సెక్రటరీ సంజీవరాయుడులు తెలిపారు. భవిష్యత్తులో బాగాచదివి ఉన్నత స్థాయికి ఎదిగి అటు గ్రామానికి ఇటు సమాజానికి సేవాభావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు పార్థసారధి, రఫీ బాషా, ఓబులరెడ్డి, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, రంగేశ్వరరెడ్డి, శివ గణపతి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

## ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన అడ్వకేట్ త్రివిక్రమ్ సింగ్

## జులై 07 నుండి 12 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు



**బద్వేల్ అర్బన్ జూన్ 26: ప్రభాతవార్త :**

మున్సి పాలిటీ పరిధిలోని సిద్ధవటం రోడ్డు, సుమిత్రానగర్‌లో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో జూలై 7 నుండి 12 వరకు స్వామివారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన సీనియర్ అడ్వకేట్, ఆలయ గౌరవ సలహాదారులు త్రివిక్రమ్ సింగ్, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

**బ్రహ్మోత్సవాల కార్యక్రమాల వివరాలు:**

ఆలయ అర్చకులు శ్రీ వీరేశాచార్యులు, టి.టి.డి. వేద పండితుల ఆచార్యత్వంలో ఈ ఉత్సవాలు జరగనున్నాయి, జూలై 7 (మంగళ)సాయంత్రం 5 గంటలకు అంకురార్పణ, గరుడ పట అధివాసము జూలై 8 (బుధ)మహా కుంభారాధన, తదితర కార్యక్రమాలుశేష వాహన సేవ జూలై 9 (గురు)లక్ష్మీ నారాయణ హోమంహనుమత్ వాహన సేవ జూలై 10 (శుక్ర)స్వామివారి కళ్యాణోత్సవం, గరుడ వాహన సేవ జూలై 11 (శని)లక్ష్మీ హయగ్రీవ హోమంపల్లకీ సేవ జూలై 12 (ఆది)చక్రస్నానం,పుష్పయాగం, మహా పూర్ణాహుతి కార్యక్రమం కలదు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వెంకటరమణ, త్రివిక్రమ్ సింగ్ మాట్లాడుతూ, భక్తులందరూ ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. పుష్పయాగం కోసం భక్తులు తమ శక్తికొద్దీ పుష్పాలను సమర్పించుకోవచ్చని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొడిసిపాటి అంకయ్య, చీదర్ల రమణయ్య, మాలే పెంచల్ రెడ్డి, తాతనబోయిన వెంకటసుబ్బయ్య, మడపూర్ వెంకట రమణ, వల్లం కొండు అనిత్, బండారు సురేష్ బాబు, పత్తి హరీష్, దాస సతీష్ మరియు ఇతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రెండోరోజు కుంభాభిషేక ఉత్సవాలు



**రాజంపేట, జూన్ 26 ప్రభాతవార్త**

రాజంపేట అమ్మవారి శాలలో రెండో రోజు శుక్రవారం కుంభాభిషేక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున పూజలతో అమ్మవారికి మేలుకొలుపు పాడారు. అనంతరం ప్రాతకాల పూజలు చేశారు. రుద్రాభిషేకం నిర్వహించారు. వాసవి మాత మూలమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఓంకార రూపిణి వాసవి మాతకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. ప్రాంత: దీక్ష హోమం, ఆచరణ దేవత హోమాలను వేద పండితులు నిర్వహించారు. వేదమంత్రాలతో అమ్మవారి శాల మార్మోగింది. సాయంత్రం చతుర్వేద పారాయణం, ప్రదోషకాల పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శుక్రవారం కూడా కావడంతో పెద్ద ఎత్తున మహిళా భక్తులు కుంభాభిషేక ఉత్సవాలకు తరలివచ్చారు.

# రైతులకు ప్రకృతి వ్యవసాయ

## వనరుల ఉత్పత్తి కేంద్రంలో అవగాహన

**కలసపాడు, జూన్ 26 ప్రభాతవార్త:**

మండలం ముద్దిరెడ్డిపల్లె గ్రామంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా అమలు చేయబడినటువంటి జీవ వనరుల ఉత్పత్తి కేంద్రం ను శుక్రవారం ఆర్.ఎస్.కె పరధిలోని రైతులను తీసుకెళ్లి విజట్ చేయించారు. పిఆర్ సి కేంద్రాలు చుట్టుపట్టు గ్రామంలో రైతులకు కూడా ఇన్పుట్స్ అందించే జీవన కేంద్రంగా ప్రకృతి వ్యవసాయ రైతులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.



# ఘనంగా మొహరం వేడుకలు



**దువ్వూరు, జూన్ 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులోనూ, చుట్టు ప్రక్కల గ్రామాల్లోనూ శుక్రవారం మొహరం వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రమైన దువ్వూరులో ఉన్న బాదుల్లా పీరు, బంగారు పీరు, హైదర్ వాళ్లకు చెందిన పీర్లను దువ్వూరులోని ప్రధాన రహదారి గుండా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో పీర్ల వద్ద చదివింపులు చేశారు. అలాగే ఎర్రబల్లె, బుక్కాయ పల్లె, చిన్నసింగన పల్లె తదితర గ్రామాల్లో కూడా మొహరం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# అరుదైన పుట్టగొడుగు

**దువ్వూరు, జూన్ 26, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని చిన్నసింగనపల్లె గ్రామంలో శుక్రవారం అరుదైన పుట్టగొడుగు లభించింది. గ్రామానికి చెందిన లక్ష్మీ పుల్లారెడ్డి ఇంటి సమీపంలో పుట్టగొడుగు ఉండగా దాన్ని పీకి వేశారు. దాన్ని తూకం వేయగా 1కేజీ 400 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. ఇంటి సమీపంలో ఉన్న పుట్టగొడుగును పెద్దగా ఉండటంతో దాన్ని తీశామని రైతు తెలిపాడు. దీన్ని తూకం వేయగా ఎక్కువ బరువు ఉంది. ఈ పుట్ట గొడుగును కొందరు తింటారని కొందరు పిచ్చి పుట్టగొడుగు అని భావించారు. దానిని తినకుండా వదిలేశారు. అయితే ఎక్కువగా తూకం ఉండటంతో గ్రామస్తులు దాన్ని చూసేందుకు ఎగబడ్డారు.

# ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి : ఆర్డీవో

**పీలేరు జూన్ 26 ప్రభాతవార్త:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలకు తావు లేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని పీలేరు మండల తహసీల్దార్ శివకుమార్ అన్నారు. శుక్రవారం పీలేరు మండలంలోని పలు గ్రామాల్లో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే పనులను ఆర్డీఓ, పర్యవేక్షణ అధికారి నారాయణరెడ్డితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివకుమార్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలు అందించే సమాచారం ఆధారంగా పూర్తి స్థాయిలో ధృవీకరణ చేపట్టి, ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచాలని ఆదేశించారు. ఆర్డీఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ, SIR సర్వే ప్రజాస్వామ్య ప్రక్రియలో అత్యంత కీలకమైన కార్యక్రమమని అన్నారు. ప్రతి బీఎల్‌ఓ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని తెలిపారు. సర్వేలో నిర్లక్ష్యం లేదా తప్పిదాలకు ఎలాంటి అవకాశం ఉండకూడదని హెచ్చరించారు. అనంతరం అధికారులు బీఎల్‌ఓల పనితీరును పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. ప్రజల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తూ, సర్వేను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు, గ్రామస్థులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో నారాయణరెడ్డి, తహసిల్దార్ శివకుమార్

# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 26, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం ప్రొద్దుటూరు టుటౌన్ ఎస్పై రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు టుటౌన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీటు బెల్టు ధరించాలని, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడడం ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఒక కుటుంబం ఆర్థికంగా ఎంతో నష్టపోతుందని, కుటుంబ పెద్ద తీవ్రంగా గాయపడితే కుటుంబ సభ్యుల మనోవేదన లాంటి దుస్థితి ఎవరికీ రాకూడదన్నారు. అందరూ తమ వంతు బాధ్యతగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని ప్రొద్దుటూరు టుటౌన్ ఎస్పై రాఘవేంద్రరెడ్డి విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఇరుగులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**సిద్దవటం, జూన్ 26 ప్రభాతవార్త**

మూలపల్లె క్రాస్ సమీపాన వెలసిన గ్రామ దేవత శ్రీ ఇరుగులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు మండలంలోని మూలపల్లి క్రాస్ సమీపాన తెలిసిన శ్రీ ఇరుగులమ్మ అమ్మవారికి శుక్రవారం, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి, కుంకుమార్చన అభిషేకాలు వంటి విశేష పూజలు నిర్వహించి పసుపు కుంకుమతో అలంకరించారు సిద్ధవటం గ్రామ నివాసులు గట్టుపల్లి వెంకటసుబ్బయ్య, ధర్మపత్ని పద్మజ కుటుంబీకులు అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారిని దర్శనం చేసుకున్న భక్తులకు అనుగ్రహం ఉంటుందని వ్యాపార ఉద్యోగ, ఆరోగ్య సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టుపల్లి శ్రీనివాసులు, మోనిక, రవితేజ, చైతన్య జయ కిషోర్ సాయి స్వరూప్ అతికారి చిన్న వెంకటయ్య మాజీ సర్పంచ్ భవనాసి ఓబులయ్య అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

# నేలవంక తాండాపై అధికారుల నిర్లక్ష్యం

**వేంపల్లె జూన్ 26 ప్రభాతవార్త**

వేంపల్లి మండలంలోని నేలవంక తాండాలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. గత పది రోజులుగా చుక్కనీరు కూడా అందకపోవడంతో తాండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల దూరం తిరుగుతూ నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తాండాలోని ప్రధాన బోరులో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు బిందెడు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేలవంక తాండాపై అధికారులు సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. తాగునీటి కష్టాలను వివరించేందుకు తాండా ప్రజలు జెడ్పీటీసీ మాచిరెడ్డి రవికుమార్ రెడ్డిని ఆశ్రయించారు. మండుతున్న ఎండల్లో తాగునీరు అందక చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పాటు శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడాలని జడ్పిటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. స్పందించిన జడ్పిటిసి వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తానని తెలిపారు. దీంతో నేలవంక తాండా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# నిత్విక మృతి కేసులో దోషులు

## ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం**

**మారెడ్డి లతారెడ్డి, జోగిరెడ్డి**



చిన్నారి మృతి దేహం వద్ద పరామర్శిస్తున్న దృశ్యం

**పులివెందుల జూన్ 26,ప్రభాత వార్త :**

నియోజక వర్గ పరిధిలోని లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో చోటుచేసుకున్న నాలుగేళ్ల చిన్నారి నిత్విక మృతి ఘటనపై బాధ్యులు ఎంతటి వారైనా చట్టం ముందు తప్పించుకోలేరని పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న వారు కూటమి నాయకులతో కలిసి మృతిచెందిన చిన్నారి నిత్విక తల్లిదండ్రులు సృజన, రామాచారిలను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మారెడ్డి లతారెడ్డి, జోగిరెడ్డి మాట్లాడుతూ చిన్నారి మృతి ఘటన అత్యంత బాధాకరమని అన్నారు. పోలీసులు ఘటనపై వేగంగా స్పందించి దర్యాప్తును ముమ్మరం చేశారని తెలిపారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారని, విచారణలో ఎవరైనా దోషులుగా తేలితే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, దర్యాప్తు పూర్తయిన అనంతరం బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అజ్జుగుట్టు రవితేజ రెడ్డి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

**ముద్దనూరు, జూన్ 26 (ప్రభాతవార్త):**

మొహర్రం పండుగ సందర్భంగా శుక్రవారం ముద్దనూరు పట్టణంలోని పీర్ల చావిడిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పీర్లను దర్శించుకుని పూలహారాలు, చక్కెర సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం నిర్వహించిన పూల షేహెరాల ఊరేగింపులో పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొహర్రం పండుగ కులమతాలకు అతీతంగా సోదరభావాన్ని, సామరస్యాన్ని పెంపొందించే పండుగ అని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, సీఐ నాగేష్ బాబు, జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గురప్ప, ఎస్‌వీఆర్ ట్రాన్స్‌పోర్ట్ అధినేత వరదా రెడ్డి, చింతా శివరామిరెడ్డి, కమిటీ సభ్యులు, అబ్దుల్ ఖాదర్ పట్టణ ప్రముఖులు మరియు భక్తులు పాల్గొన్నారు.



# నేటి నుండి శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి తిరుణాల..

**సుండుపల్లి, జూన్ 26, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామం బహుద నది ఒడ్డున వెలసిన శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి తిరుణాల 27వ తేదీ శనివారం నుండి 29 తేదీ సోమవారం వరకు మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు ఓబయ్య నాయుడు తెలియజేశారు. 27వ తేదీ ఉదయం అభిషేకము పూజలు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం 28 తేదీ ఆదివారం కుంకుమార్చన పూజలు 29 తేదీ సోమవారం సాయంత్రం చెక్కభజనలు విద్యుత్ దీపాలంకరణలతో చాందిని బండ్లు కట్టి భక్తుల తమ కోరికలు తీర్చుకుంటారని తెలిపారు.

# ఎస్ఐఆర్‌పై నాయకులకు కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం

**పీలేరు జూన్ 26 ప్రభాతవార్త:**

స్థానిక తిరుపతి రోడ్డుమార్గంలోని కళ్యాణ మండపంలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై వైకాపా నాయకులకు కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ ఈ సమావేశంలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్లను తొలగించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధహస్తుడని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వీఎస్ఆర్ కల్యాణమండపంలో పీలేరు, కేవీపల్లె, కలికిరి మండలాలకు చెందిన వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, బీఎల్ఎలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎన్ఐఆర్) కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతోందన్నారు. పక్క రాష్ట్రాల్లో సర్వేలో భాగంగా భారీగా ఓటర్లు తొలగించడం జరిగిందని తెలిపారు. ఎస్ఐర్ సర్వే పట్ల వైఎస్సార్సీపీ నాయకులు ఏమరపాటు పనికిరాదన్నారు. పీలేరు నియోజకవర్గంలో 281 బూతులు ఉన్నాయని, అందులో 2,36,506 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే చాలా వరకు ఇన్యుమరేషన్ ఫారంలు ఇవ్వడం జరిగిందన్నారు. టీడీపీ ఓటర్ల తొలగింపుకు ప్రత్యేక యాప్ తయారు చేసి వైఎస్సార్సీపీ వర్గానికి చెందిన ఓటర్ల తొలగింపు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రతి ఓటు కీలకమైందని అన్నారు. స్థానిక సంస్థలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలన్నారు. అధికార పార్టీకి ప్రభుత్వ యంత్రాంగం అండదండలు ఉంటాయని, మనం గెలుపొందాలంటే ప్రతి ఓటు కీలకమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, హరీష్ రెడ్డి, డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, నల్లారి తిమ్మారెడ్డి, శ్రీఖరెడ్డి, నరసింహారెడ్డి, ఎంపీపీ సతీష్ రెడ్డి, నూర్జహాన్, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖరెడ్డి. గజ్జెల శృతి, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్లు దండు జగన్మోహన్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, రమేష్ రెడ్డి. మహితా ఆనంద్. నియోజకవర్గ పరిశీలకులు ఉదయ్ కుమార్ ,బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడు సుధాకర్, నాయకులు మాసుం రఫీ, మల్లీశ్వరి, నాగరాజమ్మ, లక్ష్మి, అరుణ, హరిత. ఎన్.వి. చలపతి. గజ్జెల శీన్ రెడ్డి, చక్రధర్, సి.కె. యర్రమరెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, కాలనీ చిన్న, విజయశేఖరెడ్డి, షాకీర్, పి. ద్వారకనాథరెడ్డి, భువనేశ్వరెడ్డి, లోకనాథరెడ్డి, నీరజ, రాజేశ్వరి, రాజ్యలక్ష్మి, షపూరా, బావాజి, హరీ, సురేంద్రరెడ్డి, అమరనాథరెడ్డి. మునీర్, దావూద్, అబీద్, ఉబేదుల్లా, రియాజ్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి

# ఇమామ్ హుసేన్ త్యాగానికి ప్రతీక మొహరం పండగ

**జమ్మలమడుగు, జూన్ 26, ప్రభాతవార్త:**

మహ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమాహ హుసేన్ (ర.అ) ప్రపంచ మానవాళి కోసం మరియు ఇస్లాం స్థాపన కోసం శత్రువులతో పోరాడి ప్రాణత్యాగం చేసి అమరులయ్యారని అలాంటి మహోన్నత వ్యక్తి అయిన ఇమాం హుసేన్ చేసిన ప్రాణ త్యాగానికి గుర్తుగా నేడు యావత్ ప్రపంచ మానవాళి మొహరం పండగ నిర్వహించుకుంటునానరని జమ్మలమడుగు జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి పేర్కొన్నారు. శుక్రవారం మొహరం పండగ సందర్భంగా పట్టణంలోని జామియా మసీదులో జుమ్మా నమాజులో హజరత్ ఇమాం హుసేన్ త్యాగనిరతికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం భక్తుల నడుమ మహ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమాం హుసేన్ తన జీవిత కాలంలో చేసిన పనులు మరియు భక్తులకు చూపిన మహిమల గురించి వివరించారు. ప్రపంచ మానవాళి కోసం ఇస్లాం స్థాపన కోసం శత్రువులతో కుటుంబీకులతో సహా వీరోచితంగా పోరాడి అమరులైన అమర వీరుల కథనాన్ని వివరించారు. అనంతరం మొహరం పండగ సందర్భంగా గురు, శుక్రవారాల్లో 2 రోజుల పాటు ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు పాటించిన సందర్భంగా వారితో కలిసి పీఠాధిపతి మరియు గురువులు, భక్తులు ఉపవాస దీక్ష విరమించారు. ఈ కార్యక్రమంలో గురువులు అసద్ పాషా ఖాద్రి, గౌస్ పాషా ఖాద్రిది, మోసిన్ పాషాఖాద్రి, వారి కుటుంబీకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

